

# గొడుగు

''యెప్పుడు షాపింగ్‌కి వచ్చినా నీ కళ్లు గొడుగు మీద వాల్తాయేం యిందిరా? అన్ని గొడుగులు కావాలా? వానాకాలంలో వస్తారా చుట్టాలు? రెయిన్‌కోటుతో రారూ? గొడుగులు పోతూ వుంటే మళ్లా కొంటూ వుంటావా? ఓసారి మీ బెడ్‌రూమ్‌లో బట్టల స్టాండుకి చూశాను. అదే రోజున డైనింగ్ రూమ్‌లో టేబిల్‌కి ఆనించి వున్నది చూశాను. మరోసారి విజిటర్స్ రూమ్‌లో'' అని నవ్వుతున్నది మధుమతి. ఇందిరకి దాయాది, వరసకి వదిన అవుతుంది.

''వర్షాకాలంలో వస్తే బాగానే వుండును మధూ. కాలంతో నిమిత్తం లేకుండా రాత్రిళ్లూ, అదీ అర్ధరాత్రి రైలులో వచ్చి దిగుతారు. యేం చేయాలో తెలియదు. వారి అక్కరకూ నా ఆత్మరక్షణకూ రెడీగా గొడుగు అందుబాటులో వుంటే కొంత నయం'' గొడుగు విప్పి చూస్తూ అన్నదిందిర. షాప్ కీపర్ని అడిగే తీసుకున్నది. ''విప్పి చూడొచ్చమ్మా. చూడండి. లేటెస్టువి. ఒంటెమార్కువీ, బుట్టమార్కువీ, పూలవీ, లేడీస్ మెచ్చేవీ పిల్లలకి రంగురంగులవీ కూడా వున్నాయి'' అన్నాడు షాప్ ఓనర్.

సరసానికి మోచేత్తో నెట్టుతూ మధుమతి,

''భలేదానివే యిందూ. వరసైనవారొస్తారాయేం అర్ధరాత్రి? వస్తానే గొడుగు డిమాండ్ చేస్తారా? అర్ధరాత్రింబు గొడుగు దెమ్మనక యున్నె అన్నట్టు ప్రవర్తిస్తారా?'' అన్నది.

అవునన్నట్టు ఆవులాగా తలూపుతూ యిందిర విప్పిన గొడుగును హాండిల్

పట్టుకుని గిరగిరాతిప్పి చూసి వినోదించి ముడిచి కాగితపు సంచీలో దూర్చింది. పట్టుకునే వున్నది.

''యెంతైనా తెలుగు విభాగ హెడ్డువి మధూ. సరైన సామెత గుర్తొచ్చింది నీకు. అది కల్పనా గాదు. కవిత్వము గాదు సక్రియలిస్టు కంపోజ్ చేసి వుండాలి'' అన్నది ఇందిర.

ఇద్దరూ యింకా కావల్సినవి వెతికి తెచ్చి బల్ల మీదుంచారు. కౌంటర్ దగ్గర నిలబడి చూస్తున్నారు.

''గొడుగు నిజంగా కొంటున్నావా? పాతవి వున్నట్లున్నాయే! వచ్చినవాళ్ళు కొత్తగొడుగుచూసి ముచ్చటపడి పట్టుకుపోతారేమో.'' ''అన్నీ సరిగానే వూహిస్తున్నావు మధూ. వూహ వున్నదేమోగాని అనుభవం లేదేమో! శలవలు నీ దగ్గర గడపాలని వున్నదని వ్రాస్తావు గానీ మధూ రానే రావు. శలవలొస్తున్నాయి. ఈ సారన్నా మాట నిలబెట్టుకో. సరదాగా గడుపుదాం.'' అన్నది యిందిర. బిల్ అందుకున్నది.

''తప్పకుండానూ. మీ అన్నగారు విదేశయానం ప్రోగ్రామ్ పెట్టుకున్నారు. నేను రానని చెప్పేశాను. వాయుయాన మంటేనే భయం నాకు. ఆ యెయిర్ బస్ యేం చేస్తుందో చెప్పలేం కదా. పదికాలాల పాటు బతికివుండి మునిమనమల్ని చూడాలని వున్నది'' ''మరీ మంచిది మధూ. బాడీగార్డు వుద్యోగం చేసే పని తప్పించావు'' అన్నారు ''అన్నగారూ వదినా. పిల్లకాయలేమో నానమ్మా, తాతా రమ్మని రాశారు. వెళ్తాము. అని వాళ్ల ప్రోగ్రాం చెప్పేశారు. పట్నవాసం కన్న పల్లెవాసమే బాగుంటుందిట. నిద్దర్లేచింది మొదలు పరుగెత్తక్కర్లేదుట. పొద్దెక్కేదాక నిద్దరోవాలని కోరికట. వస్తా. బైబై సోలాంగ్.'' బిల్ చెల్లించేసి హాండ్

బాగ్‌ను బుజానికి వేలాడేసి, వేరే సంచిలో తాను కొన్న ఐటమ్స్ పెట్టుకుని చెయ్యి వూపుతూ వెళ్లిపోయింది మధుమతి.

''కార్లో పెడ్తున్నానమ్మా.'' అన్నాడు బోయ్. ''పద'' అని గొడుగు పట్టుకుని అతని వెనకాలే వెళ్లింది యిందిర.

2

''తలుపెవరో కొడ్తున్నారొదినా. కరెంటు కట్ అయిందేమో కాలింగ్ బెల్ వినబడటం లేదు. సాంబయ్య అన్నగారు మేడమీద శయనించారివాళ. కాక్‌టెయిల్ పార్టీనించి లేట్‌గా వచ్చారు రాత్రి. మెలకువ రాలేదేమో. లే. లే. చూద్దావూ. నాకు భయం, టార్చిదిగో తలగడాకిందుంచా. అరే! ఫాన్ తిరుగుతున్నదే. కాలింగ్ బెల్ వినబడాలే. బాదటమెందుకు?'' మధుమతి ఆవలించి కూచున్నది బెడ్ మీద.

ఇందిర లేచింది. ''వేరే మెషీన్ పనిచేస్తుంది ఫాన్ తిరగటానికి అటువేపు సామానుగదిలో వున్నది. ఎసి ఆగిపోయింది చూడు.'' మంచం దిగి లైటు వేసింది యిందిర.

బెడ్ రూమ్ నించి డ్రాయింగ్ రూమ్‌లో కొచ్చారిద్దరూ. ఇందిర టార్చ్ వేసింది. కొవ్వొత్తి వెలిగించింది. దీపారాధనా వెలిగించింది. మరో చిన్న టార్చీ ఆన్ చేసింది. వాకిలి తలుపుకి వున్న అద్దంలోంచి చూశారు. మీట పైకి నెట్టి గడియ తీసి గొలుసు సగం వరకు వదులుచేసి చూసి అప్పుడు తలుపు పూర్తిగా తీశారు.

ఇందిర తల్లీ అన్నా లోపలి కొచ్చారు. నాటు బెడ్డింగూ, చేతి సంచీ, ట్రంకూ, హాలులో మధ్యగా వుంచాడన్న. చేతి కర్రతో నిలబడివున్న, శుక్లాలేర్పడి

కబోది అయిన తల్లిని తెచ్చి సోఫాలో కూచోబెట్టాడు. చేతి సంచీనించి మూడు గిన్నెల కేరేజీ, వాటర్ బాటిల్, గ్లాసూ, ప్లేటూ తీసి నేలమీదుంచాడు. లైట్లు వెలిగినై. అన్న కళ్లు వెలిగినై. చేతులు కడుక్కొచ్చాడు. ఇద్దరి చెప్పులూ సోఫా వెనక వుంచాడు. ఒక గిన్నెలో నీళ్లు పోసి తల్లి చేతులు కడిగించాడు. కారేజీ వూడదీసి, పళ్లెంలో అన్నం కూరా కలిపి నేయి వేసి తల్లిచేత అన్నం తినిపించాడు. కర్ర కుర్చీ కాన్చాడు. పప్పుచారూ అన్నం, మజ్జిగా అన్నం. దానిలోకి ఆవకాయ ముక్క. ముగించి చేయీ మూతీ కడిగించి తువాలాతో తుడిచాడు. కారియరు మూశాడు. లేచాడు.

''ఈమె నెక్కడ పడుకోబెట్టాలి. బెడ్డింగ్ విప్పేదా?'' అనడిగాడు.

''అక్కర్లేదు. అదుగో స్పేర్ బెడ్‌రూమ్. రెండు పక్కలున్నాయి'' ఇందిర వెళ్లి లైటు వేసింది.

తల్లికి కర్ర అందించి, తీసికెళ్లాడు అన్న. ఆమె పవ్వళించింది.

''నేనిప్పుడు తినను. రైలు లేటు. పదిన్నరకి రావాల్సిన రైలు ఒకటిన్నరకి వచ్చింది. నేను స్నానం చేసి జపించనిదీ తినను. రైలులోను అనువుగా లేదు. నాన్‌వెజిటేరియన్సు, బెర్త్‌మీదే అన్నీ అవుర్చి తిన్నారు. ఈ అంటగిన్నెలెక్కడుంచాలి?''.

ఇందిర అవన్నీ తీసికెళ్లి సింకులో వుంచి తడిగుడ్డ తెచ్చి నేలతుడిచింది.

''మిగిలిన భోజనం పొద్దున్నే పనిదానికేయాలి. స్వయంపాకం.'' అన్నాడు.

కథా నిలయం
5247
శ్రీకాకుళం



''అలాగే'' అన్నది ఇందిర.

మధుమతిని చూస్తూ'' అవి ఆ గదిలో వుంచు.'' అన్నాడు.

మంత్రించబడినట్టు మధుమతి, నాటు బెడ్డింగూ చేతిసంచీ ట్రంకు పట్టుకుని అతని వెనకాల వెళ్లింది. బెడ్‌రూమ్ అల్మరాలో అమర్చింది. చిరిగిన తాటాకు విసనకర్రతో తల్లికి విసురుతూ రెండో బెడ్ జరిపి కూచున్నాడు అన్న.

మధుమతి ఫాన్ వేసి లైటార్పి, తలుపు చేరవేసి వచ్చి యిందిర పడుకున్న బెడ్‌రూమ్‌లో రెండో బెడ్‌మీద వాలింది.

అయిదింటికి కాలింగ్ బెల్ మోగింది. మరో అతిథి తన కొడుకుతో కార్లో వచ్చాడు. బెల్ కొట్టింది డ్రైవర్.

తలుపు తెరవబడగానే లగేజ్ తెచ్చి లోపలుంచి, బాడుగందుకుని కారు తోలుకుపోయాడు డ్రైవరు.

సాంబయ్య మేడ దిగి వచ్చాడు. నిద్ర కళ్లు. లుంగీ. చొక్కాలేదు.

''రైలు టైమ్‌కి వచ్చిందా అన్నాయ్! నీ ఫాక్స్ మెసేజ్ అందగానే అన్నీ అరేంజ్ చేశాను. డ్రైవరు నిన్నది వరకు చూశాడు గదూ చెప్పక్కర్లేదు. లాబ్‌లో టెస్టులయాక నర్సింగ్‌హోమ్‌లో అడ్మిట్ చేయటమే. మేడమీద బెడ్ రూమ్ రెడీగా వుంచాను. పైకి పోండిద్దరూ. నేనూ ఇందూ లగేజ్‌పైకితెస్తాం.'' అన్నాడు నిలబడి. మధుమతి అన్నది.

''నేనూ వదినా చేస్తాం లెండి ఆపని అన్న గారూ. మీ కింకా నిద్రమత్తు వదల్లేదు. తూలిపడతారేమో. రాత్రి మీరు పార్టీనించి వచ్చేప్పటికి

పదకొండున్నరయింది. పోయి అనుష్ఠానాలు తీర్చుకోండి.'' ఇందిర అందుకోగా మిగిలినవి మధుమతి అందుకున్నది. మెట్లెక్కారు.

3

సాంబయ్య పదిన్నరవరకు క్లబ్బులో బ్రిడ్జి ఆడి, ఆఫీసర్స్‌కి గుడ్‌బై చెప్పి వచ్చాడెలాగైతేనేం. అది ఆఫీసర్స్ క్లబ్. వారికి రాత్రిళ్లే తీరికమరి. దుస్తులు మార్చుకుని డైనింగ్ టేబిల్ ముందు కొచ్చి మేలుకుని కూచుని వున్న ఇందిరనూ మధుమతినీ చూసి సారీ చెప్పాడు. వంటమనిషి మేలుకోలేనని వెళ్లిపోయింది. ఎపిలెప్సీ అనే వ్యాధితో బాధపడుతుంటే సాంబయ్య ట్రీట్‌మెంట్ యిప్పించాడు. మందులిప్పించాడు.

మందు వేసుకుని పెందలాడే నిద్రబోవాలన్నాడట డాక్టరు. తలదిమ్మట. వాళ్లబ్బాయి జాబ్ పర్మనెంట్ చేయించాడు సాంబయ్య.

ఇద్దరూ సర్వ్ చేసి తామూ కూచున్నారు. అన్నీ అందుబాటులో వుంచారు బల్ల మీద.

సూపరింటెండింగ్ పశుపతి గారి భార్య శాంకరీభాయి మూరెడు కొత్త టార్చీ వెలుగు చిమ్ముతుండగా వచ్చి తలుపు తట్టింది. ఇందిర వెళ్లి తీసింది. ఆమె వచ్చి డైనింగ్ టేబిల్ ముందున్న కుర్చీలో కూచున్నది.

'' ఇందిరా! మీ సర్వెంటు కొడుక్కి, వాన్ క్లీనర్ వుద్యోగం యివ్వమని నీ హబ్బీ మా ఆయనతో చెప్పాడు. మీ సర్వెంటూ స్వయంగా వచ్చి లబలబలాడింది. జాబ్ కావాలంటే యేం చేయాలో చెప్పాను. చెప్పినది చేసి

చూపంగానే ఆర్డర్సు చేతికందుతాయి. అంటే అంతివ్వలేనన్నది. ఫాన్ షాపు రన్ చేస్తున్నావు. దాని మీద అప్పు యిస్తారు. లేదా ఆర్నమెంట్సు నా దగ్గరుంచు నేనిస్తానంటే సంతోషంగా ఒప్పుకున్నది. కానీ నగ నీ దగ్గరుంచుతానన్నది. అదిస్తావా? మనీ తెచ్చాను.'' అన్నది.

''నాకేమీ యివ్వలేదండీ. వుద్యోగం కోసం లావాదేవీలు జరుగుతున్నాయనీ తెలియదు'' అన్నదిందిర.

''పోనీ మనీ అందితే నీ కిమ్మన్నానే. సరేనన్నది'' అని అనుమానంగా చూసింది శంకరీబాయి.

''అదీ జరగలేదండి. అదసలు రెండు రోజుల్నించీ గైరుహాజరు. మేమే సద్దుకు పోతున్నాము'' అన్నదిందిర.

''వాషింగ్ మెషీన్, యిల్లు శుభ్రం చేసేవీ, పాత్రలు శుభ్రం చేసేదీ కొత్తది కొని, ఫిట్ చేయించారండీ సాంబయ్య అన్నగారు. సరదాగా అవి యూస్ చేశాము నేను వదినా'' అన్నది మధుమతి.

''నువ్వూ నీ పనిమనిషి కూడి యేదో చేశారు. దాస్తున్నావు. జాబ్ వుచితంగా వస్తుందా? పోనీ సగమే యివ్వచ్చునే'' అంటుండగా సాంబయ్య ఆమె ముందు ప్లేటుంచి స్వయంగా సర్వ్ చేశాడు. ''కానీండి. శాంకరీ బాయిమ్మగారూ. తింటూ సరదాగా మాట్లాడుకుందాం'' అన్నాడు సాంబయ్య. మాట మార్చాలని యిందిర, ''తొమ్మిదింటికి రారాదండీ? పదకొండు దాటాక తింటే, తిన్నదరుగుతుందీ?'' అన్నది.

''మెంబర్స్ వదిల్తేనా. లేచినప్పుడల్లా లాగి కూలేశారు. గెలుస్తున్నావుగా

సాంబా. వర్రీ యెందుకు'' అని నవ్వారు.

మధుమతి రెండోసారి పదార్థాలందిస్తూ నవ్వుతున్నది.

శాంకరీబాయమ్మ అన్నీ ఆరగిస్తూ అన్నది. ''మీరు శిఫార్సు చేసిన అబ్బాయికి జాబ్ వచ్చేందుకు నే చెప్పినట్లు చేస్తానని మీ పనిమనిషి ప్రామిస్ చేసింది. కాని మీ భార్యా మెడిల్‌సమ్. అన్నిటిలో తలదూరుస్తున్నది. పని నెరవేరాలంటే యేం చేయాలో మీ రామెకు నేర్పలేదా?''.

''నేను యెప్పుడో వార్నింగిచ్చాను. అన్నిటిలో కలగజేసుకుని పనిపాడు చేయకు. అడ్డు రాకు. శాంకరీబాయమ్మగారు దయగల తల్లి. ఆనెస్ట్. ఒకరి అవసరం ఆమె యిట్టె కనిపెట్టి పనిచేసి పెడతారు. లే ఇందూ. బోరన్‌వైటా సీసా ఖాళీ అయితే క్లీన్ చేసి యెండబెట్టి ఆవకాయతో నింపావు. ఆ సీసా అల్మర్లోంచి తెచ్చి ఆమె దగ్గర పెట్టు. ప్లాస్టిక్ కవర్లో పెట్టావు. అయిపోయింది భోజనం. ఫ్రూట్ సలాడ్. కస్టర్డ్ ఐస్‌క్రీమ్ జెల్లీ ప్లేట్లు ఆమె ముందుకు జరుపు మధూ.'' అని నాప్‌కిన్ అందుకుని చేయీ మూతీ అద్దుకున్నాడు సాంబయ్య ఆఫీసర్.

అవీ పూర్తి చేసి లేచింది శాంకరీబాయి. టార్చ్ అందుకున్నది. ''నేను పోవాలి. వానపడుతున్నట్టున్నదే గొడుగున్నదా?'' అంటూ ఆవకాయ సీసా సంచీ అందుకున్నది.

సాంబయ్య లేచి మూలగా వున్న గొడుగు విప్పి ఆమె వెంట వీధిలోకి నడిచాడు. ఆమె వెనక్కి చూసి,

''రేపు మీ పనిమనిషిని నా యింటికి పంపు యిందిరా. నేను దాని సంగతి తేలుస్తా. నిన్ను నమ్మాలో దాన్ని నమ్మాలో తెలియటం లేదు'' అంటూ వెళ్తూ,

గేటు దాకా వచ్చిన సాంబయ్య చేతిలో గొడుగందుకుని గేటు దాటింది శాంకరీబాయమ్మ.

మరునాడు పనిమనిషి కూతురు రాజుకుమారి పదహారేళ్లమ్మాయి సినీస్టార్ లాగా తయారై పనిలో కొచ్చింది.

''మా యమ్మకి పసిగర్లయినాయన్నారమ్మా డాక్టరు. వాంతులౌతున్నాయి. అమ్మ యిబ్బంది పడుతుంది. నువ్వు పన్లో కెళ్లు. అని నన్ను తోలింది'' అన్నది వాకిట్లో ముగ్గు పెడ్తూ,

సాంబయ్య రాజుకుమారి పనిచేసే తీరు చూసి, సొగసుచూసి ముచ్చట పడ్డాడు. పోవాల పోవాల అనకుండా నిదానంగా చేస్తూ పెట్టిందేదో తిని కాఫీ తాగింది.

దాని దగ్గర నిలబడి, ''శాంకరీబాయమ్మ నిన్ను పంపమన్నది వెళ్లు'' అన్నాడు.

రాజుకుమారి బట్టపైకెగ్గట్టి బకెట్లో బట్టలు తీసి పిండుతున్నది. తల అడ్డంగా తిప్పింది.

''నే నెల్లను బాబూ. శాంకరీబాయమ్మ బిడ్డ యింజనీరింగ్ చదువుతున్నాడే, ఆడు నా మీద కన్నేశాడు. బుజం మీద చెయ్యి వేస్తే నేనలాంటి దాన్ని కాదన్నాను. చెయ్యి పట్టుకుంటే ఆల్లమ్మనూ బాబునూ కేకేస్తే పారిపోయాడు. నమ్ము నమ్మనేపో బాబూ! మీ బంధువబ్బాయి నాకు రోడ్డు మీద అడ్డమొచ్చి, ''డబ్బిస్తాను వస్తావా?'' అనడిగాడు. ''బాబుతో చెప్తా'' అన్నాను.

అన్న కొడుకు మేఘనాథ్ నవ్వుతూ వచ్చాడు. ''నేనట్లా అనలేదు బాబాయ్. 'డబ్బులిస్తాను. కోడిగుడ్లు తీసుకురా.' అన్నాను. నేరం చెప్తున్నది సినీస్టార్.''

''నువ్ తెచ్చుకోరాదూ భద్రం! నేను పోలీసు రాంబాబు మేనగోడల్ని. రోడ్డు మీదే సరాగం! ఇంట్లో యేల చెప్పలేవూ?''

అలా సన్నని జల్లులాగా యింట్లో చిన్న విషయానికి రగడ జరుగుతుండగా మధ్యాన్నం రెండైంది. సాంబయ్య డైనింగ్ టేబిల్ ముందున్నాడు సాంబయ్యకి సర్వ్‌చేసి, యెదురుగా తమ యిద్దరికీ సర్వ్‌చేసిన మధుమతి అన్నది.

''నేను వెళ్తానన్నగారూ.''

''యేమైంది? హెల్పింగ్ హాండ్‌లాగా బాగానే వున్నావుగా?'' అని తినసాగాడు.

''వదినవేపువారు నా ఓరిమికి టెస్టు పెడుతున్నారు. వదినేమో యోగినిలాగ చెక్కు చెదరకుండా సహజ స్వభావాన్ని కాపాడుకుంటున్నది. వడ్డన చేసి యెన్ని అందించినా, భోజనం వేళ ఛేంజ్ చేస్తున్నారు. దబ్బ, నిమ్మ, చింత, గోంగూర అలా డిమాండ్ చేస్తూ వట్టిపెరుగన్నం తినలేదుట తల్లి. కొడుకు బాగా ఆడిస్తాడు. నోట్లోవి కింద బడేస్తుంది తల్లి. తెల్లార్లూ నిద్ర చెడుగొడుతూ కోలా, ఐస్ వాటర్, అలా కావాలని జబర్దస్తీ. సీలింగ్ ఫాన్ చప్పుడుకి నిద్ర చెడుతున్నదట. స్టాండున్నది పెట్టాలిట.'' అని తానూ కూచుని అన్నం కలుపుకున్నది మధు.

''ఫ్రస్టేట్ అయి అలా బిహేవ్ చేస్తున్నారు. వాళ్ల దోవన వాళ్లే పోతారని చూస్తున్నాను'' పప్పు, కూరా అన్నం తింటున్నాడు.

''ప్రస్తేషనెందుకు? కూతుర్ని చూసిపోదామని వచ్చారుట. తల్లి కబోదని కొడుకు సాయంట.''

'పైకి అలా నమ్మిస్తున్నారుగానీ మధూ! తల్లికి శుక్లాలు తీయించాలని తెచ్చానని నాతో అన్నాడు. నేత్రాలయకి తీసికెళ్లి చూపితే స్పెషలిస్టు, సర్జనూ, యింగ్లండ్ రిటరన్ సత్యం, బాగా ముదిరాయి. తీయరాదు మెడనరాలు దెబ్బతిని ఆగిపోతుంది. యెనభై దాటి తొంభైకి చేరుతున్నామె చూపు వచ్చి యేమి చేయగలదంటారు. అలా వుండనిస్తేనే మంచిది. మరో పదేళ్లుంటారామె' అని పంపేశాడు. వున్న వూరూ బాగా లేదుట. ఇల్లు అమ్మటం ఖాయం. ఆ డబ్బుతో సిటీలో అన్నీ వసతులున్న ఫ్లాట్ కొంటారుట. చూడమన్నారిద్దరూ. లేదంటే, బేస్‌మెంట్‌లో చౌకట. ఆ వేడుకా అయింది. ఫ్రెండుని రమ్మని ధర చెప్పించాను మూడు లక్షలపైనే'' అని వాడు వెళ్లగానే, ''మీ మేడమీద రెండు గదులొస్తాయా డబ్బుకి. అమ్ము. డబ్బిప్పుడే చెల్లిస్తాను. రాతకోతలై పోతాయి. మరోవేపు మెట్లు వేయిస్తాము. మీరున్న వేపు రాము. మనవడికి పెళ్లి స్థిరపడింది వాడి జాబ్‌పర్మినెంట్ అయింది. మీ మేడలో పెళ్లి జరిగిపోతుంది. వేరే విడిది వెతగక్కర్లేదు'' అని అరిచారిద్దరూ. 'అవేవీ జరగవు' అన్నాను.

''మీ వెంటబడ్డారిద్దరూ'' భోజనం పూర్తి చేసి లేచాడు సాంబయ్య. ఇందిర తలొంచుకుని పెరుగన్నం తింటున్నది. మధుమతి అన్నం తినటం మరిచిపోయి నోరు వెళ్లబెట్టి, వెళ్లిపోతున్న సాంబయ్యను తలొంచుకున్న వదిననూ చూసింది.

ఆ రాత్రి సాంబయ్య బెడ్ రూమ్‌లోకి తల్లీ కొడుకూ దుమారం లాగా వచ్చారు. ''రైలు ఛార్జీలు నష్టం. ఒక్క పని నెరవేరకుండా చేస్తున్నావు. పోతాము. పిండం లేక రాలేదు. మీ పంచన పడివుందామని రాలేదు. రైలు ఛార్జీ లివ్వాలి

అది మా జిల్లా ఆచారం. మీ కోస్తా ఆచారం వేరు. ఒంటి గంటకి రైలున్నది. ఫోన్ చేసి కనుక్కున్నాము ఇపుడే పోయి స్టేషన్లో కూచుంటాము. డ్రైవర్ని పిలు సర్వెంట్ క్వార్టర్స్‌లో వున్నాడుగా. నీ కళ్లకి కావరం యెగదట్టింది. వాడు ఖాళీ చేస్తాడు మీరా క్వార్టర్సులో వుండండి అంటావా? మేము సర్వెంట్సుమా? నువ్వెంత జేసు నీ వుద్యోగమెంత జేసు?''

ఇందిర నోట్ల కట్ట అందించింది.

''గొడుగు కావాలి. వాన వచ్చేట్టున్నది. ఉక్క. తూనీగలు తిరుగుతున్నయి. అమ్మ తడుస్తుంది.'' అన్నాడన్న. బీరువాలో వేలాడదీసిన రెండు గొడుగులు తెచ్చి అందించింది యిందిర.

నాటు బెడ్డింగు, సంచీలు రెండు, ట్రంకూ తెచ్చి కారులో వుంచారు మధుమతీ డ్రైవరూ.

తల్లిని వెనకసీట్లో పడుకోబెట్టటానికి యిందిరా మధు సాయం చేశారు. అన్న ఫ్రంట్ సీట్లో డ్రైవరు పక్కనున్నాడు. మధు గేటు తీసి పట్టుకున్నది. కారు వెళ్లిపోయింది.

పొద్దునే వాన అందుకున్నది. వెలుస్తుంది. మళ్లా వస్తుంది. వెలుస్తుంది. సాంబయ్య మేనమామ సీతాకాంతం గొడుగు చంకన బెట్టుకుని మెట్లు దిగాడు.

కాఫీ ఫలహారం అయాయి. వక్కపొడి నవులుతున్నాడు.

చేతిలో సంచీ. సాంబయ్య పోర్టికోలో నిలబడి వున్నాడు.

''సాంబీ! నా మనుమడు భూతరాజు, నిరశన వ్రతం పట్టి మెడిసిన్‌లో

సీటు పట్టుకురా తాతా! లేకపోతే యీ నిరశన వ్రతం ఆమరణ నిరాహార దీక్షలోకి పోనిస్తా'' అంటే పనివేళా, నా స్వంత పన్లు మానుకుని వస్తే, మొండిచెయ్యి చూపించావు. ఈ సిటీ యేకచ్ఛాధిపతోద్యోగం గా యేలుతున్నావనీ వచ్చారా సాంబీ'' అన్నాడు వక్క నములుతూ సీతాకాంతం.

''చెప్పాగా మామయ్య కాపిటేషన్ ఫీజు కట్టు సీటు వస్తుంది. కనీసం వెయిటింగ్‌లిస్టులోనన్నా వస్తుంది భూతరాజు పేరు అంటే'' అని సాంబయ్య ధీర్ఘం తీశాడు.

''ఫీజు వేలల్లో అనుకున్నారా సాంబీ, భూమి తనఖా పెట్టి తేలేనా అనుకుంటే నువేమో లకారమంటివి. పోనీ లకారం చేబదులిప్పించు అంటే అదీ లేదు.''

'' ఇచ్చే ఆయన వూళ్లో లేడు మామయ్య. మరో చోట ప్రయత్నిస్తే 'వడ్డీకిస్తా. హామీ వుంటారా? అని నవ్వాడు.

'అర్ధరాత్రి గొడుగు తెమ్మన్నట్టున్నదండీ లక్షలు చేబదులిచ్చే వాళ్లున్నారా? మతి బోయింది నాకా మీకా? లాయర్ని పట్రండి రాతలు కోతలు చూద్దాం' అని నవ్వుతూ వూగిపోయాడు మామయ్య. ఉన్మాదేమో'' అన్నాడు సాంబీ.

'' ఇందిర నగలుంచి తేవచ్చు గదరా'' అన్నాడు మామయ్య.

''వదినవన్నీ నకిలీ నగలే. యిస్తే ఓ వెయ్యి యిస్తారేమో.'' అంటూ మధు నవ్వింది.

''నువ్వెవరే శకునపక్షీ!'' కళ్లద్దాల పైనించి చూశాడు సీతాకాంతం, ''మధు

కదూ. ఇంతమటుకు పెళ్లాడకుండా దాటవేస్తున్నావు. యేదో సాగితే అన్నట్టున్నది నీ వ్యవహారం'' అన్నాడు మోటుగా.

మధుమతి నేలకూలింది.

''మధుకి ఎపిలెప్సీ సాంబూ. అందుకే పెళ్లి ఆగిపోతున్నది. మీ అత్తయ్య శాంభరికి ఆస్థ్మా ఎటాక్ వచ్చి చాలా అవస్థగా వున్నది సాంబీ! ఇందిరనూ, దానికి హెల్పర్ గా మధును పంపించు. పిల్లల్ని చూసేందుకు, యిల్లు మానేజ్ చేసేందుకు నౌకర్లున్నారుగా. మీ అన్న పద్మనాభాన్నీ, కొడుకునూ నాతో రమ్మంటే, నా రైలు ఖర్చులు పెట్టుకోవాల్సి వస్తుందని రామన్నారు నాతో. తన రైలు ఖర్చులు కలిసొచ్చే పనే చేతులో పెట్టుకొచ్చాడు పద్మనాభం'' అని నిష్ఠూరమాడి వెళ్లిపోతున్న మామయ్య చేతిలో గొడుగు చూసింది మధు. అది వదిన కొన్న కొత్త గొడుగే. సీతాకాంతం గొడుగు విప్పుతుండగా సాంబయ్య పెన్ను ఆయన జేబులో మెరిసింది.

గొడుగు ముడిచి కారులో దూరి ''పోనిమ్మని'' ఆర్డరొస్తున్న అతిథిని చూశాక, వదిన కళ్లెప్పుడూ గొడుగు మీదెందుకు పడతాయో తెలిసింది మధుమతికి.